# దృష్టి

ఎదురింటి కాలింగ్‌బెల్ మోగిన శబ్దం వినిపించి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాను. ఆ ఇంటి ద్వారంవద్ద ఓ వ్యక్తి నిలబడివున్నాడు.

ఆసక్తిగా చూడసాగాను. కొన్ని క్షణాల తర్వాత ఇంటితలుపు తెరుచుకుంది. ముందుగా 'ఆమె' ముఖం కనిపించింది. తర్వాత 'ఆమె' కనిపించింది. ఆమె తలుపు పూర్తిగా తెరిచి అతన్ని నవ్వుతూ ఆహ్వానించింది. అతను లోపలికి వెళ్లాడు.

ఆమె తలుపు మూయబోతూ నావైపు చూసింది. ఆ చూపుల్లో ఏ భావమూ లేదు, మార్పూ లేదు. ప్రతిరోజూ చూస్తున్నట్లే ఉన్నాయి. ఆ చూపుల్లో బిడియం కానీ, గిల్టీఫీలింగ్ కానీ కనబడదు.

ఆ ఇంటితలుపు మూసుకుంది. లోపల ఏం జరుగుతోందో ఊహించుకోగలను. కుర్చీలో కూర్చుని పుస్తకం చేతిలోకి తీసుకున్నాను. చదువుపై ధ్యానం కుదరటం లేదు. ఆలోచనలన్నీ 'ఆమె' చుట్టే తిరుగుతున్నాయి.

ఆమె చాలా అందంగా ఉంటుంది. ముప్పై దాటివుంటుంది ఆమె వయసు! ఎటువంటి చౌకబారు అలంకరణలు చేసుకోదు. చాలా సింపుల్‌గా ఉంటుంది. ఇంటికి వచ్చినవ్యక్తిని కళ్ళతోనే ఆహ్వానిస్తుంది. అయితే ఆ కళ్ళలో కవ్వింపు ఉండదు. ఒక్కోసారి నవ్వుతూ ఆహ్వానిస్తుంది. ఆ నవ్వులో వెకిలితనం ఉండదు. అయితే ఆమె ఇంటి కాలింగ్ బెల్ నొక్కగానే వినిపించే పాటలోనే నాకు చౌకబారుతనం ఉందనిపిస్తుంది. 'రావే రావే ముద్దులగుమ్మా... రావే రావే!' అని వినిపించే ఆ పాట నాకు చిరాకును తెప్పిస్తూంటుంది. ఆ పాట ఆమె సెలెక్షనో, ఎలక్ట్రీషియన్ ఛాయిసో తెలియదు. బహుశా ఆమె 'వృత్తి'కి సరిపోయే విధంగా ఉంటుందని ఆమె ఆ పాటను ఎన్నుకుని ఉండొచ్చు.

ఆమె ఇంటికి రోజుకు కనీసం ముగ్గురైనా వస్తూంటారు.

ఒక్కొక్కరు దాదాపు గంటసేపు ఆమె ఇంట్లో గడుపుతారు. వచ్చినవాళ్ళే మళ్లీ మళ్లీ వస్తారు. వాళ్ళు వచ్చినప్పుడు ఆమె తలుపు తీస్తూ నాకు కనబడుతుంది. వాళ్ళు వెళ్లేటప్పుడు ఆమె నాకు కనిపించదు.

ఆమె మంచి పొడగరి. అందమైన శరీరాకృతి ఆమె సొంతం. కొంతమంది షూస్ వేసుకుని వస్తారు ఆమె ఇంటికి. వాళ్ళు షూస్ విప్పి లోపలికి వెళ్లేంతవరకు ఆమెను పరిశీలనగా చూసే అవకాశం నాకు కలుగుతూంటుంది. కనురెప్పలు వాలిస్తే ఆ క్షణం వ్యర్థమైపోతుందన్న భయంతో రెప్పవాల్చకుండా ఆమెను నఖశిఖపర్యంతం చూస్తూంటాను.

విజయవాడలో ఓ ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్న నేను ప్రమోషన్ టెస్ట్ రాయడానికి హైదరాబాద్ వచ్చాను. నేను హైదరాబాద్ ఎప్పుడొచ్చినా హిమాయత్‌నగర్‌లో ఉంటున్న మా అక్కయ్య ఇంట్లోనే దిగుతాను. ఈసారి కూడా నేను హైదరాబాద్‌కు వస్తున్నానని అక్కయ్యకు ఫోన్‌చేసి చెబితే తాము ఢిల్లీ వెళుతున్నామనీ, నేను వచ్చే సమయానికి తాము ఉండటంలేదనీ వాపోయింది. ఇదీ ఒకందుకు మంచిదే... చదువుకోవడానికి కావాల్సినంత ఏకాంతం దొరుకుతుందనుకుని వారంరోజులు ముందే బయలుదేరి హైదరాబాద్ వచ్చేశాను.

నేను హైదరాబాద్ చేరినరోజే వాళ్ళు ఢిల్లీ బయలుదేరుతున్నారు.

"ఒరేయ్ః... నువ్వు స్టేషన్‌కి వస్తున్నావా?" అక్కయ్య అడిగింది నన్ను.

"లేదు. మా కొలీగ్ పెళ్ళికి మలక్‌పేట వెళ్లాలి. ఇప్పటికే ఆలస్యమైంది. ఇక నేను బయలుదేరతాను. మీ ముగ్గురికీ నా బెస్ట్ విషెస్... హ్యాపీ జర్నీ!"

"రాత్రి ఇంటికి రావా నువ్వు?"

"రాకపోవచ్చు. కొలీగ్స్ అందరూ వస్తారు. సరదాగా గడపాలనుకుంటున్నాను."

"నువ్వు విజయవాడ వెళ్లేటప్పుడు ఇంటితాళం చెవులు టూనాట్‌ఫోర్ ఫ్లాటులో ఉన్న గాయత్రికి ఇచ్చెయ్. వీలైతే ఆమెను నాతో మాట్లాడించు. జాగ్రత్త! ఆమె గాయత్రి అని కన్‌ఫర్మ్ చేసుకున్నాకే ఇవ్వు. లేదా ఇప్పుడోసారి వచ్చావంటే ఆమెను పరిచయం చేస్తాను. సెకండ్ ఫ్లోర్‌లోనే ఉంది వాళ్ళ ఫ్లాటు."

"ఇప్పుడు టైము లేదక్కా! నేను కన్‌ఫర్మ్ చేసుకునే ఇస్తాలే!" అంటూ గదిలోకెళ్లి దుస్తులు మార్చుకోసాగాను. అప్పుడు అక్కయ్య బావతో మెల్లగా అంటున్న మాటలు అప్రయత్నంగా నా చెవిలో పడ్డాయి.

"వీడు ఎదురింటి వగలాడి వలలో పడతాడేమోనని నాకు భయంగా ఉందండీ..."

"పడకపోతే వాడి భార్య అదృష్టం! పడితే వాడి అదృష్టం!" అంటూ నవ్వుతున్నాడు బావ.

"ఛ... అలా ఎలా మాట్లాడతారు మీరు? మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. అంటే అవకాశం దొరికితే మీరూ ఆ ఇంట్లో దూరేవారా? అదృష్టవంతుణ్ణని పొంగిపోయే వారా?" కోపంగా అరుస్తోంది అక్కయ్య. నేను వారి సంభాషణ వింటానేమోనన్న భయం ఇప్పుడు ఆమెలో లేదు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాళ్ళ అబ్బాయి ఇంట్లో లేడు.

"సర్లే... ఏదో తమాషాకన్నాను గానీ– ఊరికి వెళ్లేముందు నువ్వు సీరియస్ అవ్వకు. ట్రిప్ అంతా పాడవుతుంది... ప్లీజ్!" బావ వేడుకుంటున్నాడు.

అప్పుడే ఆ 'వగలాడి' ఎవరో చూడాలనే ఆసక్తి కలిగింది నాకు.

మరుసటిరోజు సాయంత్రం ఇల్లు చేరుకున్నా తర్వాతి రోజు ఉదయం దాకా ఆమెను చూసే అవకాశం దొరకలేదు. చూశాక ఆమెను చూసే ఏ అవకాశమూ నేను వదులుకోలేదు.

క్రమంగా ఆ ఇంటి కాలింగ్ బెల్ నొక్కాలన్న ఆలోచన నాలో కలిగి, అది కోరికగా మారింది. వివాహేతర సంబంధాలను తీవ్రంగా వ్యతిరేకించే నాకు అటువంటి ఆలోచనలు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. 'ఇంటిగ్రిటీ ఈజ్ ల్యాక్ ఆఫ్ ఆపర్చ్యునిటీ' అంటారు కొంతమంది. నా విషయంలో అది నిజమో, కాదో తెలియదుగానీ– ఎదురుగా కనిపిస్తున్న అందం నన్ను నిలవనీయడం లేదన్న మాట మాత్రం పూర్తిగా నిజం!

ఆమె ఇంట్లోకి ఏ సమయంలో వెళ్లాలి?

రాత్రి ఏడు గంటల తర్వాత ఆమె ఇంటికి ఎవరూ రాకపోవడం గమనించాను. ఆ సమయంలో వెళితే మంచిది. పైగా, రేపు నేను విజయవాడ వెళ్లిపోతున్నాను కాబట్టి– ఈరోజే ఆమె ఇంట్లోకి వెళ్లాలి.

మధ్యాహ్నం భోజనం కోసం హోటల్‌కి బయలుదేరాను. రోడ్డు మీదకి రాగానే మోటార్‌బైక్‌పై వెళుతున్న మా కొలీగ్ మధుకర్ కనిపించాడు. అతను విజయవాడలో నాతోపాటు నాలుగేళ్లు పనిచేసి, తర్వాత హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయ్యాడు. నన్ను చూడగానే బైక్ ఆపి, నా దగ్గరకు వచ్చాడు.

"హాయ్ఁ... నువ్వేమిటి... ఇక్కడ?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"ప్రమోషన్ టెస్ట్ కోసం వచ్చాను."

"ఎలా ఉన్నావు?"

"బాగున్నాను."

"పద... నువ్వు ఎక్కడికి వెళ్లాలో చెబితే డ్రాప్ చేస్తాను."

"భోజనానికి హోటల్‌కి వెళ్తున్నాను. పక్క వీధిలోనే ఉంది హోటల్. నేను నడచి వెళతానులే!"

"ఈ బిల్డింగ్‌లో ఎవరున్నారు?"

"మా అక్కయ్యవాళ్లు ఉంటున్నారు. ప్రస్తుతం వాళ్లు టూర్‌లో ఉన్నారు. అందుకే హోటల్‌కి వెళుతున్నాను."

"ఏ ఫ్లోర్‌లో ఉంటున్నారు?"

"థర్డ్ ఫ్లోర్‌లో!"

"బాప్‌రే! ఆ ఫ్లోర్‌లో ఓ అద్భుతమైన అందం ఉంది. వెయ్యి రూపాయలిస్తే నీ ఆనందం, ఆరోగ్యం అన్నీ ఆమే చూసుకుంటుంది. ఎటూ ఇంట్లో ఎవరూ లేరంటున్నావు. రొట్టె విరిగి నేతిలో పడటం అంటే ఇదే! నీ పాలసీలూ, ప్రిన్సిపల్సూ నాకు తెలుసు. గంటసేపు వాటికి సెలవు ఇవ్వు. జీవితాంతం గుర్తుంచుకునే అనుభవం నీ సొంతమవుతుంది. ఆల్ ద బెస్ట్!" అన్నాడు.

మధుకర్ మరో ఐదు నిమిషాలు నాతో మాట్లాడి వెళ్లిపోయాడు.

●

ఆ రోజు రాత్రి నాలుగుసార్లు ఎదురింటి గుమ్మం వరకూ వెళ్లి తిరిగివచ్చిన తర్వాత అయిదోసారి వెళ్లినప్పుడు ధైర్యం తెచ్చుకుని కాలింగ్ బెల్ నొక్కాను.

తలుపు తెరచిన ఆమె ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

తర్వాత పక్కకు జరిగి దారిచ్చింది. లోపలకు వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. హాల్లో రెండు ప్లాస్టిక్ కుర్చీలు తప్ప మరో ఫర్నిచర్ లేదు. టీవీ లేదు. షోకేసు ఖాళీగా ఉంది.

'ఈవిడగారికి హాల్లో ఏ పనీ లేదు కాబోలు!' అనుకున్నాను.

ఆమె కుర్చీ లాక్కొని నాకు కాస్త దూరంలో కూర్చుని నావైపు చూడసాగింది. ఆమె ఈరోజు మరింత అందంగా కనిపిస్తోంది. ఎఱ్ఱటి బార్డర్ ఉన్న నల్లని కాటన్ చీర ధరించి ఉంది. చీర ఆమె ఒంటికి అతుక్కుని ఉన్నందువల్ల ఆమె అందాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, నాలో తీయని అలజడిని కలిగిస్తున్నాయి.

బయట ఏవో మాటలు వినిపించి భయంతో బిగుసుకుపోయాను. 'ఎవరైనా వచ్చి తలుపు తడితే? లోపల ఉన్న నన్ను చూసి ఎవరని ఆరా తీస్తే? విషయం అక్కయ్యకు చెబితే? వద్దు... త్వరగా ఇక్కడ్నుంచి వెళ్లిపోవాలి!' అనుకున్నాను. కానీ, వెళ్లలేకపోతున్నాను. ఆమెను అలాగే చూస్తూ ఉండిపోవాలనిపిస్తోంది.

ఉన్నట్లుండి మరో ఆలోచన వచ్చింది. 'ఈ ఇంట్లో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని అపార్ట్‌మెంట్స్‌లోని జనం నుంచి సమాచారం పోలీసులకు అంది, వాళ్ళు ఈ ఇంటిపై రైడ్ చేస్తే? నన్ను మొదట పోలీస్‌స్టేషన్‌కి, ఆ తర్వాత కోర్టుకి తీసుకెళితే... నా ఉద్యోగం, పరువు ఏమవుతాయి? వద్దు... నేను వెళ్లిపోవాలి!' అనుకున్నాను.

'ఇంటిగ్రిటీ ఈజ్ నాట్ ఓన్లీ ల్యాక్ ఆఫ్ ఆపర్చ్యునిటీ, బట్ ల్యాక్ ఆఫ్ కరేజ్ ఆల్సో!' అనిపించింది.

వెంటనే మరో ఆలోచన కూడా వచ్చింది... ఆమెను మా ఇంటికే రప్పిస్తే బాగుంటుంది. ఎవరైనా వచ్చి తలుపు తట్టినా నా తప్పేమీ లేదనీ, డబ్బు కోసం తనే నన్ను ఒత్తిడి చేస్తోందనీ చెప్పవచ్చు. ఆమె 'క్యారెక్టర్' అందరికీ తెలుసు కాబట్టి ఆమెనే తప్పుపడతారు. నా మీద జాలి చూపిస్తారు.

కానీ, ఆమెని ఇంటికి ఎలా రప్పించాలి?

ఆ ప్రశ్నకు కూడా జవాబు దొరికింది నాకు. నాలో దురాలోచనలు పెరుగుతున్న వేగాన్ని చూసి ఆశ్చర్యపోయాను.

నేను ఏమీ మాట్లాడకపోవడం గమనించిన ఆమె- లేచి లోపలికి పోబోయింది.

నేనూ లేచి నిలబడి "వస్తానండీ..." అన్నాను.

"కూర్చోండి... కాఫీ తెస్తాను!" అంది.

"ఫర్వాలేదు. నేను మీ ఎదురింట్లోని మా అక్కయ్య ఇంటికొచ్చాను. ఒకసారి పరిచయం చేసుకుందామని వచ్చాను... వస్తాను."

తలుపు వైపు నడిచేముందు నేను కూర్చున్న కుర్చీలో వెయ్యి రూపాయల నోటును ఆమె చూడకుండా పడేశాను.

ఇంట్లోకి వచ్చి తలుపు గడియ వేసుకుని కిటికీ దగ్గర కూర్చున్నాను. 'నేను వచ్చేశాక ఆమె దృష్టి ఆ వెయ్యి రూపాయల నోటుపై పడుతుంది. నా ఆహ్వానం ఆమెకు అర్థమౌతుంది. ఆమె నా దగ్గరికి వస్తుంది' అనుకున్నాను.

నా ఊహ నిజమైంది!

ఆమె ఇంటి తలుపు తెరుచుకుంది. ఆమె బయటకు వచ్చి మా ఇంటి వైపు నడవసాగింది.

నాలో ఉత్సాహం, ఉద్రేకం, ఆనందం!

కాలింగ్ బెల్ మోగగానే తలుపు తెరిచి ఆమెవైపు చూశాను.

"మీ జేబులోంచి డబ్బు కుర్చీలో పడిపోయింది..." అంది వెయ్యిరూపాయల నోటున్న చేతిని నావైపు చాపుతూ.

"అది మీకోసమే ఉంచాను..."

"నా కోసమా..?"

"అవును. మీ గురించి నాకంతా తెలుసు. ఉంచండి... బదులు తీరుద్దురుగాని!" నవ్వుతూ అన్నాను.

"వద్దండీ! బయటివాళ్ళ దగ్గర తీసుకోక తప్పడం లేదు. ఇరుగుపొరుగు వారి దగ్గర తీసుకోవడం బాగుండదు. ప్లీజ్... తీసుకోండి!" అంటూ నోటును టేబుల్‌పై పెట్టింది.

'పాపంలో కూడా ఓ పాలసీ! శెభాష్!!' అనుకుని, "కూర్చోండి..." అన్నాను.

"మళ్లీ వస్తాను. కొద్దిగా పనులున్నాయి!" అంటూ వెళ్లిపోయింది.

ఉసూరుమంటూ నిట్టూర్చాను.

ఆమె వెళ్లిన పది నిమిషాలకు బూటుచప్పుళ్ళు వినిపించి కిటికీ తలుపులోంచి చూశాను. పోలీసులు ఆమె ఇంట్లోకి వెళ్తున్నారు. మొత్తం ఎంతమందున్నారో తెలియదుగానీ నలుగురు మాత్రం కనిపించారు నాకు.

నా ఒళ్ళు ఝల్లుమంది! 'నేను మరో పది నిమిషాలు ఆ ఇంట్లో ఉండివున్నా, ఆమె వెంటనే వెళ్లిపోకుండా ఇక్కడే ఉండివున్నా నేను ఇరుక్కుపోయి ఉండేవాణ్ణి! ఎంతలో గండం తప్పింది?!' అనుకున్నాను.

ఆమెను పోలీసులు తమతో తీసుకెళ్లే దృశ్యం చూడలేక తలుపు మూసేశాను.

●

రాత్రి పన్నెండు గంటలకు కాలింగ్ బెల్ మోగితే... వెళ్లి సైడ్‌విండో నుంచి చూశాను.

ఆమె నిలబడి ఉంది!

అయితే ఆమె ఇంటికి వచ్చేసిందన్నమాట! పోలీసులకు ఏం 'ఎర' వేసిందో కానీ, 'చెర' తప్పించుకుంది... అనుకున్నాను.

తలుపు తెరిచి ఏమిటన్నట్టు చూశాను.

"మావారికి సీరియస్‌గా ఉంది. డాక్టర్ని పిలుచుకు రావాలి..." ఆమె కళ్ళనిండా నీరు!

షాక్ తిన్నాను నేను.

'ఆ ఇంట్లో ఆమె భర్త ఉన్నాడా? ఆయన్ని ఇంట్లో ఉంచుకునే ఇవన్నీ చేస్తోందా? లేక, ఆయన బయటికెళ్ళినప్పుడు చేస్తోందా? నేను ఆమె ఇంటికి వెళ్లినప్పుడు ఆయన ఇంట్లోనే ఉన్నాడా?'

నాలో గిల్టీఫీలింగ్ మొదలైంది... ఆమె అంటే అయిష్టం కూడా కలిగింది.

"నాకీ ఊరు కొత్త! డాక్టర్లెవరూ నాకు పరిచయం లేదు..." అన్నాను.

"డాక్టర్ ఇల్లు నాకు తెలుసు. మీరు తోడొస్తే చాలు!"

ఇద్దరం ఆటోలో బయలుదేరాం. ఆమె ఆటోలో సీటు చివర నాకు చాలా దూరంలో కూర్చోవడం చూసి నవ్వుకున్నాను.

ఆమె ఓ ఇంట్లోకి వెళ్లింది. అయిదు నిమిషాల తర్వాత డాక్టర్‌తో కలిసి బయటకు వచ్చింది. ఈసారి ఆటోలో డాక్టర్‌కూ, ఆమెకూ మధ్య నేను కూర్చున్నాను. ఆమె ఒళ్ళు నాకు తగులుతున్నా ఎటువంటి అనుభూతీ కలగలేదు. అందుకు కారణం... ఆమెపట్ల కలిగిన అయిష్టం కావొచ్చు లేదా ఆమె కష్టంలో ఉందన్న జ్ఞానం ఉండటంవల్ల కావచ్చు.

ఆటో దిగి నేను నేరుగా మా ఇంట్లోకి వెళ్లిపోయాను. ఆమె భర్తను చూడాలన్న ఆసక్తిగానీ, అతని ఆరోగ్య పరిస్థితి గురించి ఆందోళనగానీ నాకు కలగలేదు.

●

ఆరోజే నాకు పరీక్ష!

రాసిన ప్రతి పరీక్షలో విజయం సాధించాను నేను. మొదటిసారిగా పరీక్ష ఫెయిలవుతానన్న భయం నాలో మొదలైంది. అందుకు కారణం... చదువుపై మనసు లగ్నం కాకపోవడం, నా ఆలోచనల్లో పూర్తిగా ఆమె నిండిపోవడం!

ఉదయం ఆరుగంటలకు తలుపు తెరిచాను. ఆమె ఇంటితలుపు తెరిచి ఉంది. ఇంట్లోంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. ఏం జరిగివుంటుందో ఊహించగలిగాను. నిర్ధారణ కోసం ఆ ఇంట్లోంచి బయటకొచ్చిన వ్యక్తిని అడిగాను.

"శారద భర్త పోయాడు!"

నా మనసు ఎంతో బాధపడింది. ఆమె కష్టంలో ఉంటే ఎదురింట్లో ఉండీ సాటిమనిషిగా ఆమెకు అండగా ఉండకుండా నిర్దయగా తలుపు వేసుకున్నందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

కొంతసేపటికి ఆమె ఇల్లు మనుషులతో నిండిపోయింది. వారిలో చాలామందిని నేను ఆమె ఇంటిముందు కాలింగ్ బెల్ నొక్కుతుండగా చూశాను.

ఆరోజు పరీక్ష సరిగా రాయలేకపోయాను. తొలిప్రయత్నంలోనే ఆఫీసర్ని అవుతానని సహోద్యోగులతో పందెంకాసి మరీ వచ్చాను. పందెంలో ఓడిపోతానని నాకు తెలుసు. అనవసరమైన ఆలోచనల వల్ల ఎంత నష్టమో మొదటిసారిగా తెలిసివచ్చింది.

సాయంత్రం ఇంటికివచ్చి బ్యాగ్ సర్దుకున్నాను. ఇల్లు లాక్ చేసి ఆమె ఇంటివైపు చూశాను. తలుపు తెరిచేవుంది కానీ, శారద కనిపించలేదు.

ఫ్లాట్ నంబరు రెండువందల నాలుగులో ఉన్న గాయత్రికి ఇంటి తాళంచెవులిచ్చాను.

నా సెల్‌నుంచి అక్కయ్యతో మాట్లాడి, తర్వాత సెల్ ఆవిడ కిచ్చాను. ఆమె ఆత్రంగా సెల్ అందుకుంది. మా అక్కయ్యలేని ఈ నాలుగు రోజుల్లో సిటీలో జరిగిన విశేషాలన్నీ అక్కయ్యతో చెబుతుందేమోనని భయంవేసింది... ఆమె ఉత్సాహం చూస్తుంటే.

"విజయా... ఎలా ఉన్నావు? ట్రిప్ బాగా ఎంజాయ్ చేస్తున్నావా? ...నీకో గుడ్‌న్యూస్- మీ ఎదురింట్లోని ఆ వగలాడిని మేమంతా కలిసి తరిమేశాం... నీవు ఢిల్లీకి బయలుదేరిన రోజు సాయంత్రం ఆ ఇంటి ఓనరు వచ్చారు. మేమంతా మాకు ఆమెవల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి చెప్పాం. ఆయన పోలీసాఫీసర్ కదా- ఆమెకి గంట టైమిచ్చి ఆలోపల ఖాళీచేయకపోతే జైల్లో పెడతానన్నాడు. ఆమె బెదిరిపోయి ఇల్లు ఖాళీ చేసేసింది. మరుసటిరోజే ఆయనకు తెలిసినవాళ్ళు ఆ ఇంట్లో దిగారు. భార్యాభర్తా ఇద్దరే! పిల్లలు లేరు. భర్త పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ మందుపాతర పేలుడు వల్ల చాలా గాయపడ్డాడట. ఎంతో ఖరీదైన ట్రీట్‌మెంట్ ఇప్పించినా నయం కాలేదట. ఇక అతను బతకడని తెలిశాక చివరిరోజుల్లో అతను ప్రశాంతంగా ఉండాలని ఈ ఫ్లాట్‌లోకి వచ్చి చేరిందట! ఆమె అభ్యర్థన మేరకు అతని స్నేహితులు వంతులు వేసుకుని ప్రతిరోజూ వచ్చి అతనితో కొంత సమయం గడిపి అతనికి మానసికానందం కలగజేసేవారట. ఈ విషయం తెలియక అందరం ఆమెను మరో వగలాడిగా భావించాం. నిన్నరాత్రి అతను మరణించాడు. ఆమెను పరామర్శించడానికి వచ్చినవారి ద్వారానే మాకీ విషయాలన్నీ తెలిశాయి. బహుశా నువ్వు వచ్చేటప్పటికి ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోతుందేమో..."

ఆశ్చర్యంగా వింటున్నాను నేను.

ఆమె సెల్ నా చేతికి ఎప్పుడిచ్చిందో, నేను ఎప్పుడు బయటకు వచ్చానో నాకు తెలియదు. నా కళ్ళనుంచి కారిన కన్నీరు నా చొక్కాను తడపడం మాత్రం తెలిసింది.

●

విజయవాడకు వచ్చిన తర్వాత చాలాసార్లు ఆమె గుర్తొచ్చేది.

అక్కయ్యను ఆమె గురించి ఓసారి అడిగితే తను ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయిందనీ, ఏదో స్కూల్లో పనిచేస్తున్నట్లు విన్నాననీ చెప్పింది.

అయిదేళ్ల తర్వాత బావకు ప్రమోషన్ మీద వారణాసికి బదిలీ కావడంతో వాళ్ళ సొంత ఇల్లు ఖాళీ అయింది. అదే సమయంలో నేను కోరుకున్న ప్రమోషన్ రావడంతో హైదరాబాద్ వచ్చి అక్కయ్య ఇంట్లో కాపురం పెట్టాను. మా అబ్బాయి ఆదిత్యను చేర్పించడానికి మంచి స్కూలు కోసం విచారిస్తే 'ఎస్.ఎస్.పబ్లిక్ స్కూలు' గురించి తెలిసింది.

ఆదిత్యను తీసుకుని ఆ స్కూలు కెళ్లాను.

కరెస్పాండెంట్ సీటులో శారదను చూసి ఆశ్చర్యపోయాను. ఆమె నన్ను చూసి ఎంతో ఆనందపడింది.

"మీరు ఏదో స్కూల్లో పనిచేస్తున్నారని అక్కయ్య చెప్పింది. ఈ స్కూల్ ఎప్పుడు పెట్టారు?" అని అడిగాను.

"ఆయన పోయాక ఓ స్కూల్లో క్లర్క్‌గా మూడేళ్లు పనిచేశాను. ఆయన డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన డబ్బులతో ఈ స్కూలు పెట్టాను. సమాజంలో హింసను తగ్గించాలని ఆయన తపించేవారు. చివరకు ఆయనే తీవ్రవాదుల హింసకు బలయ్యారు. ఆయన లేని లోటు భరించలేక మానసికంగా కుంగిపోయాను. దాదాపు పిచ్చిదానిలా మారాను. ఆయన స్నేహితులు డైవర్షన్ కోసం నన్ను స్కూల్లో చేర్పించారు. తర్వాత ఈ స్కూలు పెట్టమని సలహా ఇచ్చి, అన్నివిధాలా నాకు సాయం చేశారు. స్కూల్‌కి మా ఇద్దరి పేర్లూ కలిసివచ్చేలా 'శారదా శ్రీనివాస్ పబ్లిక్ స్కూల్' అని పేరు పెట్టాను. ఈ పిల్లల్ని శాంతికాముకులుగా తయారుచేసి సమాజంలోకి పంపిస్తాను. 'అహింసో పరమ ధర్మః' అన్న మెసేజ్‌ని ప్రజల్లో నాటుకుపోయేలా ప్రచారం చేయిస్తాను."

"మీ ఆశయం గొప్పగా ఉంది. మీ ఆశయ సాధనలో అన్నీ విజయాలే కలగాలని కోరుకుంటున్నాను" అన్నాను మనస్ఫూర్తిగా.

బాబుని స్కూల్లో చేర్పించి ఫీజు చెల్లించడానికి పర్సు తీశాను.

"మీ దగ్గర నేను ఫీజు తీసుకోను" అంది సీరియస్‌గా చూస్తూ.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను మావారి ట్రీట్‌మెంట్ కోసం చాలాచోట్ల అప్పులు చేయడం తెలుసుకుని, నాతో పరిచయం లేకపోయినా నాకు సహాయం చెయ్యాలని మా ఇంటికి రావడం, వెయ్యి రూపాయలు కుర్చీలో వదలివెళ్లడం నా మనసుని కదిలించింది. పైగా అర్ధరాత్రి డాక్టరు దగ్గరికి తోడు రమ్మంటే మానవత్వంతో స్పందించారు. నిద్ర త్యాగంచేసి మరీ వచ్చారు. మీలాంటివాళ్ళ గురించి మా పిల్లలకు చెబుతాను. వాళ్ళలో సేవాభావం, త్యాగభావం పెంచుతాను. మీ అబ్బాయి మా స్కూల్లో చదివినంతకాలం అతనికి ఎడ్యుకేషన్ ఫ్రీ! మీ మంచితనానికి నేనిచ్చే చిన్న రివార్డ్ ఇది."

నాకు సంతోషం కలగలేదు. భరించలేని దుఃఖం కలిగింది. పశ్చాత్తాపం మనసుని దహించివేసింది.

అప్పుడు... నా కళ్ళకు కామం కమ్ముకున్నందువల్ల ఆమెలోని మంచితనం, అమాయకత్వం నాకు కనబడలేదు. ఆమె మనసునిండా మంచితనమే నిండివుంది కాబట్టి నా వక్రపుచేష్టలు ఆమెకు కనబడలేదు.

ఆమె నవ్వుతోంది- హాయిగా... ఎటువంటి కల్మషం లేకుండా.

ఆ నవ్వు నామీద నాకే అసహ్యం కలిగేలా చేసింది. అంతేకాదు, భవిష్యత్తులో ఎటువంటి చెడు ఆలోచనలూ చేయకూడదన్న ప్రతిజ్ఞను కూడా నా మనసుచేత చేయించింది.

●

**'ఈనాడు' దినపత్రిక 'కథల పోటీ- 2008'లో ఎంపికై**

**'ఈనాడు ఆదివారం' ... 17 ఆగస్ట్' 2008 సంచికలో ప్రచురితమైన కథ**